క్లుప్తంగా

సాగు హక్కు కార్డులపై అవగాహన అవసరం



ఉంగుటూరు: మండలంలోని వేంపాడు, తరిగొప్పుల, మానికొండ గ్రామాల్లో పంటసాగు హక్కు పత్రాలపై (సీసీఆర్‌సీ) శనివారం అవగాహన సదస్సులు జరిగాయి. వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, ఆర్‌ఐ శంకర్ సీసీఆర్ కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. భూ యజమానికి ఇబ్బంది లేకుండా సాగుదారునికి పంట సాగుపత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కౌలు రైతు సాగు హక్కు కార్డులను తీసుకోవాలని సూచించారు. కార్డులు తీసుకోవడం వల్ల ఉచిత పంట బీమా, పంట నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు పొందడంతోపాటు, పండించిన పంటలను మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం సీసీఆర్‌సీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దుర్గానాగేశ్వరరావు, వీఆర్‌ఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

చదువుతో పాటు విలువలూ ముఖ్యమే



కంకిపాడు: చదువుతో పాటు విలువలూ ముఖ్యమేనని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో ఈసీఏ, సీసీఏ సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం పునఃప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను దేవినేని రాజా లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, విలువలు చాలా అవసరమన్నారు. ఒత్తిడిని అధిగమించి ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా శ్రమించాలన్నారు. సీసీఏ, ఈసీఏ కార్యక్రమాల లక్ష్యాలను పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి వివరించారు.

వేమూరి శ్రీనివాస్‌కు డాక్టరేట్



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలోని విజయ మహిళ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు వేమూరి శ్రీనివాస్ సాంఖ్యాక శాస్త్రంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సాంఖ్యాక శాస్త్రంలో 'సం ప్రాబ్లమ్స్ ఆఫ్ ఇన్ఫరెన్స్ అండ్ స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ ఇన్ రిలే డిస్ట్రిబ్యూషన్' అంశంపై నాగార్జున యూనివర్సిటీ సాంకేతిక శాస్త్ర విభాగం ఆచార్యుడు బాలాంతరపు శ్రీరాం పర్యవేక్షణలో వేమూరి శ్రీనివాస్ పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనపై శ్రీనివాస్ ఆరు శాస్త్రీయ ప్రచురణాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న శ్రీనివాస్‌కు కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

చిన్నారుల ఉత్సాహం కోసమే గ్రాడ్యుయేషన్‌డే



గన్నవరం రూరల్: బాలల్లో ఉత్సాహం నింపేందుకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నసీరున్నీసా అన్నారు. మండలంలోని తెంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే బాలలందరినీ ఒక చోటకు చేర్చి ఉపాధ్యాయుల సమక్షంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బాలలను ఎక్కువగా తీసుకొచ్చేందుకు ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. తల్లిదండ్రులు వారి చిన్నారులను తప్పక కేంద్రాలకు పంపాలన్నారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణ, విద్య, పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, నాగలక్ష్మి, సుమతి, వెంకటరావమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కానూరులో 2కే రన్

పెనమలూరు: అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కానూరులో 2కే రన్ నిర్వహిస్తున్నామని బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాళ్లూరి అశోక్ శనివారం తెలిపారు. నెహ్రూ యువకేంద్రం, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సహకారంతో ఉదయం ఆరు గంటలకు పంటకాలువ నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి 2కే రన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొనాలని కోరారు

నేడు ఉచిత వైద్య శిబిరం

పెనమలూరు: మండలంలోని పోరంకిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరగనుంది. శ్రీవేణుగోపాలస్వామి గుడి సమీపంలో ఉన్న డాక్టర్ భానుచంద్ర ఆస్పత్రిలో జరిగే ఈ వైద్య శిబిరంలో గుండె వ్యాధులు, షుగర్, బీపీ, నరాలు, ఊపిరితిత్తులు, అలర్జీ, ఆర్థో వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

'జగనన్న సురక్ష'ను సమర్థంగా నిర్వహించాలి

ఆర్డీఓ విజయ్‌కుమార్

కంకిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. సచివాలయ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. సమస్యలు పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వివిధ సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని ఆదేశించారు. 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా అందించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.

సర్వే పరిశీలన

జగనన్న సురక్ష కార్యక్రమం కోసం చేపట్టిన సర్వే ప్రక్రియ దావులూరులో శనివారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సర్వే జరుగుతున్న తీరును ఆర్డీఓ విజయ్‌కుమార్ పరిశీలించారు. ప్రజల సంతృప్తికర స్థాయి పెంపొందించటమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, జూలై ఒకటి నుంచి ఆయా సచివాలయాల స్థాయిలో జరిగే జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత దావులూరు పంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. దావులూరు టోల్‌గేట్ వద్ద రైతుల సాగు అవసరాలకు ఉన్న పంట బోదెను పరిశీలించి రైతుల సమస్యను తెలుసుకున్నారు. పర్యటనలో తహసీల్దార్ పి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్, డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ వెంకటరమణ, కె.సీతారామయ్య, ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అమలు చేయాలి

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని అధికారులకు విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ జాహ్నవి సూచించారు. రూరల్ మండలంలోని ప్రసాదంపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి శనివారం సర్వే నిర్వహించారు. ఈ సర్వే విధానాన్ని అధికారులతో కలిసి జాహ్నవి పరిశీలించారు. స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్లలో ఇబ్బందులు ఏమైనా తలెత్తుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జాహ్నవి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కచ్చితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. పథకాలు అందని వారిని గుర్తిస్తే వెంటనే వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు చక్రధరరావు, దుర్గారావు, రిజ్వానా, నాయకులు సర్నాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఉంగుటూరు: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. కొయ్యూరపాడులో ఎంపీడీఓ శనివారం ఇంటింటికీ పర్యటించి జగనన్న సురక్ష పథకం ప్రయోజనాలను వివరించారు. ఏవైనా సమస్యలు ఉండి సంక్షేమ పథకం అందనివారిని వలంటీర్లు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చోడవరంలో జగనన్న సురక్ష సర్వే

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం చోడవరం గ్రామంలో ఇంటింటికీ అధికారులు, సిబ్బంది వెళ్లి సర్వే చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని యాప్‌లో ఆ వివరాలు నమోదు చేశారు. జనన, మరణ, ఆదాయ, కుల, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీ, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు నమోదుకు సంబంధించిన సమస్యలను గ్రామస్తుల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా 66 టోకెన్లు గ్రామస్తులకు అందజేశారు. వచ్చే నెల ఒకటో తేదీన టోకెన్ల ఆధారంగా సమస్యలు పరిష్కారం చేస్తామని ఎంపీడీఓ సునీతా శర్మ తెలిపారు. ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన పాలనే జగనన్న సురక్ష లక్ష్యం

కంకిపాడు: మెరుగైన పాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించిందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల స్థాయి అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటం అధికారులు, ప్రజాప్రతినిధుల పూర్తి బాధ్యత అన్నారు. అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేసి సేవలు మెరుగ్గా అందేలా చూడాలన్నారు. పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఈఓఆర్డీ పి.వి.ఎస్.మైథిలి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేస్తున్న ఆర్డీఓ విజయ్‌కుమార్



ప్రసాదంపాడులో సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న తహసీల్దార్ జాహ్నవి



ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు



చోడవరంలో సర్వేను పరిశీలిస్తున్న పెనమలూరు ఎంపీడీఓ సునీతాశర్మ



మండల స్థాయి సదస్సులో మాట్లాడుతున్న కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

7న పేరంటాలమ్మకు శాకంబరీ అలంకరణ

రామవరప్పాడు: గ్రామంలోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జూలై ఏడో తేదీన అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి శనివారం తెలిపారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఈ అలంకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లు సమర్పించదలచిన భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కట్నం కోసం వేధింపులపై కేసు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురుకు చెందిన షేక్ బాజీరున్నీసా, తాపీ కార్మికుడు షేక్ సుభానీ ప్రేమించుకుని గత ఏడాది వివాహం చేసుకున్నారు. బాజీరున్నీసా విజయవాడలో బ్యూటీపార్లర్‌లో పనిచేస్తోంది. వారి పెళ్లి జరిగిన కొద్ది రోజులకే భర్తతో పాటు అత్త బాజీమున్, మామ మున్నీర్, బావ మునీర్ బడె, తోడికోడలు ఫర్హానా, ఆడపడుచు మున్నీరు కట్నం తీసుకురావాలని బాజీరున్నీసాను వేధించసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమె అత్తింటివారిపై పోలీసులు కట్నం వేధింపుల కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై కేసు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో వ్యక్తి పై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురుకు చెందిన డి.యోహాన్ వెండి సామాను వ్యాపారం చేస్తున్నాడు. అతనికి అదే గ్రామానికి చెందిన శ్రీనుతో పరిచయం ఉంది. యోహాన్ అప్పుడప్పుడు శ్రీనుకు ఆర్థిక సాయం చేస్తాడు. శుక్రవారం యోహాన్‌ను శ్రీను సొమ్ము అడిగాడు. అయితే యోహాన్ సొమ్ము ఇవ్వలేదు. మత్తులో ఉన్న శ్రీను ఆగ్రహంతో యోహాన్‌పై రాడ్డుతో దాడి చేశాడు. ఈ ఘటనలో యోహాన్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హజ్ హౌస్‌పై టీడీపీ మాట్లాడటం సిగ్గు చేటు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): హజ్ హౌస్, హజ్ యాత్రికుల గురించి టీడీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని వక్ఫ్‌బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్ ధ్వజమెత్తారు. తన కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. హజ్ హౌస్ నిర్మాణం, హాజీల గురించి తమ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ టీడీపీ నేత జలీల్ ఖాన్ మాట్లాడటాన్ని ఖండించారు. టీడీపీ పాలనలో 2018 మే18న హజ్ హౌస్‌కి శంకుస్థాపన చేసి, రూ.80 కోట్లతో నిర్మాణం చేస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసి, ఆ తరువాత దానిని పట్టించుకోలేదని గుర్తుచేశారు. కనీసం నిర్మాణపు పనులకు నిధులు విడుదల చేయకుండా మోసం చేసిన విషయం ముస్లింలకు తెలుసన్నారు. గత పాలనలో హాజీలు పొరుగు రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్నా పట్టించుకోని వారికి మాట్లాడే అర్హత లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ చొరవతో హాజీలకు ఇబ్బంది లేకుండా విజయవాడ నుంచే హజ్ యాత్రకు వెళ్లేందుకు, ప్రభుత్వం గన్నవరం విమానాశ్రయానికి ఎంబర్కేషన్ పాయింట్ తీసుకురావడమే కాకుండా, వారిపై పడిన అదనపు భారం ఒక్కొక్కరికీ రూ.80 వేల చొప్పున రూ.14.51 కోట్లు భరించిందని చెప్పారు. టీడీపీ నేతలు మైనార్టీ పక్షపాత జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. జిల్లా వక్ఫ్ బోర్డు సహాయ కార్యదర్శి ఎంపీ ఎండీ నజీర్, షేక్ బడేమియా, షేక్ ఇక్బాల్ పాల్గొన్నారు.

జగనన్న ఆశయాన్ని నెరవేర్చాలి

రామవరప్పాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాన్ని నెరవేర్చడానికి అందరూ కృషి చేయాలని గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ కోరారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ఏ సమస్యలు ఉన్నాయో గుర్తించాలని సూచించారు. సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే తొమ్మిది రకాల సర్టిఫికెట్లతో పాటు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్న అంశాలను ప్రతి ఇంటికీ వెళ్లి గుర్తించాలని కోరారు. అర్హులకు ఏ కారణాలతోనైనా పథకాలు అందకపోతే ఆ లోపాలను సరిచేసి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కోనేరు సుబ్బారావు, ఆర్.వెంకటేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ల మండల అధ్యక్షుడు సాదం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

పెనమలూరు: వృద్ధులు నేత్ర పరీక్షలు చేయించుకుని కంటి చూపు సమస్యల బారిన పడకుండా ఉండాలని జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయ్ సూచించారు. ఆమె శనివారం కానూరులో వెల్‌నెస్ సెంటర్‌లో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధాప్యంలోకి వచ్చిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని, ఇందుకు ప్రభుత్వం కంటి వెలుగు పథకం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో కంటి వెలుగు పథకం కింద వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు చేయించున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లను ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. ఎవరికైనా శుక్లాల ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్య శ్రీ పథకంతోకాని, నాన్ గవర్నమెంట్ ఆస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయిస్తామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. గర్భిణులకు సాధారణ కాన్పులు, మాతాశిశు సంరక్షణ పై కూడా పూర్తి స్థాయిలో సేవలు అందిస్తామని తెలిపారు. వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, ఆప్తామాలజిస్టు జోజికుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కానూరులో కంటివెలుగు వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపారు. తొలుత గణపతి పూజ, అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణం జరిపించుకున్న, వీక్షించినా వారి ఇంటిలో ఎటువంటి కష్టాలు ఉండవని, వివాహం కాని వారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని, దోషాలు తొలగిపోయి ప్రశాంత జీవనం సాగిస్తారని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామి ఊరేగింపు సేవలో ఉభయ దాతలు పాల్గొన్నారు.

సారె సమర్పణకు తరలివస్తున్న భక్తజనం



పూజలు అందుకుంటున్న దుర్గమ్మ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు. అమ్మ వారి సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గగుడి పాలక మండలి సభ్యుడు చింతా సింహాచలం, పలు భక్త బృందాలు శనివారం అమ్మవారికి సారెను సమర్పించాయి. పాలక మండలి సభ్యుడు చింతా సింహాచలం, విజయవాడ అపరాజిత సేవా బృందంతో పాటు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 600 మంది మహిళలు అమ్మ వారికి సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించిన భక్తులు, భక్త బృందాలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. సారె సమర్పణ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ భ్రమరాంబ పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించారు.

సచివాలయాల్లోనే ఆస్తుల రిజిస్ట్రేషన్లు

- తొలి విడత ఎంపిక చేసిన సచివాలయాల్లో ప్రారంభం
- సచివాలయం కార్యదర్శికి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ఇబ్బందులకు చెక్



ఆస్తుల రిజిస్ట్రేషన్లపై గ్రామ సచివాలయ కారదర్శులకు శిక్షణ ఇస్తున్న కానుమోలు సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు (ఫైల్)



బొమ్ములూరు సచివాయలంలో భూముల రిజిస్ట్రేషన్ చేయించిన వారికి దస్తావేజులు అందిస్తున్న కార్యదర్శి ప్రసాద్ (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజలకు రిజిస్ట్రేషన్ శాఖ సేవలు మరింత చేరువయ్యాయి. ఇంటి ముంగిటే రిజిస్ట్రేషన్ కార్యకలాపాలను పూర్తి చేసుకునే వెసులుబాటు వచ్చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించింది. ఇకపై ఆయా గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. తొలి విడతగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ సేవలను ప్రారంభించారు. భూముల రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఇక పడిగాపులు కాయాల్సిన అవసరంలేదు. సొంత ఊరిలోనే ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులువుగా పూర్తి చేసుకోవచ్చు.

ఏడు గ్రామ సచివాలయాల్లో ప్రారంభం

బాపులపాడు మండలంలోని ఏడు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ఇప్పటికే ఊపందుకున్నాయి. మండలంలోని బొమ్ములూరు, కోడూరుపాడు, ఓగిరాల, కొత్తపల్లి, రంగన్నగూడెం, శేరినరసన్నపాలెం, తిప్పనగుంట గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ శాఖ సేవలు ప్రారంభమయ్యాయి. పంట పొలాలు, ఇళ్ల స్థలాల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు, వీలునామా రిజిస్ట్రేషన్‌లు పూర్తిస్థాయి జరుగుతున్నాయి. హిందూ వివాహ రిజిస్ట్రేషన్, ఇన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), దస్తావేజు నకలు, భూముల మార్కెట్ విలువ తెలిపే సర్టిఫికెట్‌లు కూడా ఆయా గ్రామ సచివాలయాల్లోనే అందజేస్తారు. దీనిపై గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, సచివాలయం కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. డాక్యుమెంట్ స్కానింగ్, వెరిఫికేషన్, సర్టిఫికేషన్ ప్రక్రియ నిర్వహించేందుకు గ్రామ సచివాలయ కార్యదర్శులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-5 హోదాను ప్రభుత్వం కల్పించింది. దీంతో భూముల రిజిస్ట్రేషన్లు కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాయలం వద్ద పడిగాపులు పడే అవసరం లేకుండా పోయింది.

ఏటా మూడు వేల రిజిస్ట్రేషన్లు

బాపులపాడు మండలం కానుమోలులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాయలంలో ఏటా సగటున మూడు వేల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. బాపులపాడు, నూజివీడు, ఆగిరిపల్లి మండలాల పరిధిలో 29 గ్రామాలు కానుమోలు ఎస్‌ఆర్‌ఓ పరిధిలో ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి క్రయ, విక్రయదారులు కానుమోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు వంటి ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకునే వారు. ఇక గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల సదుపాయం అందుబాటులోకి రావటంతో మరింత సులువుగా మారింది.

సేవలు చేరువ

బాపులపాడు మండలంలోని బొమ్ములూరు, కోడూరుపాడు, ఓగిరాల, కొత్తపల్లి, రంగన్నగూడెం, శేరినరసన్నపాలెం, తిప్పనగుంట గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ శాఖ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆయా గ్రామస్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. భూముల రిజిస్ట్రేషన్లతో పాటుగా రిజిస్ట్రేషన్ శాఖ అందించే అన్ని రకాల సేవలు గ్రామ సచివాలయాల్లోనే అందిస్తారు.

– కె.జోగేశ్వరరావు, ఎంపీడీఓ, బాపులపాడు

గ్రామాల్లోనే రిజిస్ట్రేషన్లు

ఏ గ్రామానికి సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు ఆ గ్రామ సచివాలయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానుమోలు ఎస్‌ఆర్‌ఓ పరిధిలోని 29 గ్రామాలకు తొలి విడతలో ఏడు గ్రామ సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి అక్కడే దస్తావేజులు కూడా అందజేస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఇప్పటికే గ్రామ సచివాలయ కార్యదర్శులకు పూర్తి శిక్షణ ఇచ్చాం.

– ఎం.వెంకటేశ్వరరావు, కానుమోలు సబ్ రిజిస్ట్రార్

రచయితలే సామాజిక చైతన్యానికి పునాదులు



ప్రసంగిస్తున్న గోళ్ల నారాయణరావు

మొవ్వ: మండలంలోని చినముత్తేవిలో జీఆర్‌కే - పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే కథాకార్యశాల శనివారం ప్రారంభమైంది. సమన్విత అధ్యక్షురాలు, కథా కార్యశాల కన్వీనర్ డాక్టర్ దుట్టా శమంతకమణి స్వాగతం పలికిన ఈ సభకు కార్యదర్శి శాంతిశ్రీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. రచయితలు తమ అక్షరాలతో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నారని పేర్కొన్నారు. చరిత్రను శాశ్వతంగా భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రచయితలు ఉత్తమ విలువలతో కూడిన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలని ఆకాంక్షించారు. కార్యశాల ప్రధానాచార్యుడు వరప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, వేంపల్లి షరీఫ్, ప్రముఖ రచయితలు ఖదీర్ బాబు, కె.ఉషారాణి, రావెళ్ల లక్ష్మి, డాక్టర్ ప్రగతి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com